సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



హామీల అమలులో విఫలం

హామీలను నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ విఫలం అయ్యారని బూర నర్సయ్యగౌడ్, రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. - 10లో



ఫ్యాషన్ విద్యార్థుల సందడి

కేరళకు చెందిన ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు భుదాన్ పోచంపల్లి, దండు మల్కాపురంను సందర్శించారు. - 10లో

గరిష్టం/కనిష్టం 33°/14°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ధ్రువపత్రాల సమర్పణకు నేడు చివరి గడువు

భువనగిరి టౌన్ : గ్రూప్ 2,3,4 అభ్యర్థులకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇవ్వనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆదివారం సాయంత్రం లోపు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జైపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 97 దరఖాస్తులు రాగా 77 మంది అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. వీరికి వాట్సాప్ ద్వారా సమాచారం అందజేసినట్లు తెలిపారు. అభ్యర్థులు నేడు ఉదయం 10 గంటలకు భువనగిరిలోని జాగృతి డిగ్రీ కళాశాలలో తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఈనెల 9నుంచి కోచింగ్ ప్రారంభిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9492363910ను సంప్రదించాలన్నారు.

యాదాద్రీశుడికి రాచకొండ అడిషనల్ సీపీ పూజలు



అడిషనల్ సీపీ సత్యనారాయణకు లడ్డూ అందజేస్తున్న ఆలయ అధికారి రాజు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని శనివారం రాచకొండ అడిషనల్ సీపీ సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలకు, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆచార్యులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఉపాధిహామీ పనులపై ఓపెన్ ఫోరం



మాట్లాడుతున్న ఎంపీపీ గుత్త ఉమాదేవి

సంస్థాన్ నారాయణపురం : ఉపాధిహామీ పథకం 13వ విడత ఓపెన్ ఫోరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మండలంలోని 31 గ్రామాల్లో 2020 – 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.13.51 కోట్లు విలువ చేసే పనులు చేపట్టారు. గ్రామాల వారీగా చేపట్టిన పనులను తనిఖీ బృందం గుర్తించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గుత్త ఉమాదేవి మాట్లాడుతూ పనులు పారదర్శకంగా చేపట్టాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఏపీడీ శ్యామల, హెచ్‌ఆర్ మేనేజర్ సంపత్‌కుమార్, ఎస్‌ఆర్‌పీ ప్రమోద్, ఎంపీడీఓ రాములు, ఏపీఓ ప్రశాంతి, టీఏ లహరి, ఏఫ్‌ఏలు నర్సింహ, వెంకటేశం, శ్రీను, నర్సింహ, లోడే యాదయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ సాధించడమే లక్ష్యం



అధికారులతో కలిసి స్వచ్ఛ యాదాద్రి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్

యాదగిరిగుట్ట : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంక్ సాధించడమే లక్ష్యమని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ సుధాహేమేందర్‌గౌడ్ తెలిపారు. స్వచ్ఛ యాదాద్రి కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ అమెరికా సౌజన్యంతో శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఈడీ అవగాహన ప్రచార రథాన్ని ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై ఇష్టానుసారంగా పడేయకుండా ప్రచార రథం బొమ్మల భాషలో ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. అంతే కాకుండా రిసోర్స్ పర్సన్లు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తెస్తారని పేర్కొన్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువైన యాదగిరిగుట్టను స్వచ్ఛతలో నంబర్ వన్ స్థానంలో నిలుపుదామన్నారు. అందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ నుంచి జేఎస్‌ఆర్ అన్నమయ్య, వసీం, సాయి కిరణ్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

● రథంపై విహరిస్తూ.. భక్తులకు అభయమిస్తూ



యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దివ్య విమాన రథంపై తిరువీధుల్లో ఊరేగుతున్న శ్రీస్వామి, అమ్మవారు



ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో యాదాద్రీశుడి కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

గొల్లగట్టు పిలుస్తోంది

నేటి నుంచి దురాజ్‌పల్లి లింగమంతులస్వామి జాతర

- గంపల ప్రదక్షిణతో శ్రీకారం చుట్టనున్న నిర్వాహకులు
- రాత్రి కేసారం నుంచి రానున్న చౌడమ్మ తల్లి దేవరపెట్టె
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- 20 లక్షల మంది తరలివచ్చే అవకాశం



విద్యుత్ లైట్ల వెలుగుల్లో శ్రీలింగమంతుల స్వామి ఆలయం, పరిసరాలు

చివ్వెంల(సూర్యాపేట) : రెండేళ్ల కోసారి జరిగే పెద్దగట్టు జాతరకు వేళయ్యింది. యాదవుల ఆరాధ్యదైవంగా భావించే చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతుల స్వామి జాతరకు ఆదివారం గంపల ప్రదక్షిణతో శ్రీకారం చుట్టనున్నారు. ఇదే రోజు రాత్రి కేసారం నుంచి చౌడమ్మతల్లి దేవర పెట్టెను ఆలయానికి తీసుకువస్తారు. బోనాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరతో ఆ ప్రాంతమంతా గజ్జెల లాగుల గలగలలు.. భేరీ మోతలు.. కటారు విన్యాసాలు.. ఓలింగా నామస్మరణతో సందడిగా మారనుంది. ఈ జాతర కోసం అధికారులు, దేవస్థానం కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా 20 లక్షల మంది భక్తులు తరలిరానున్నారు.

ఆలయం ముస్తాబు

ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీలింగమంతుల స్వామి ఆలయానికి రంగులు వేసి సంప్రోక్షణ గావించారు. మెట్లు, ప్రవేశ ద్వారానికి కూడా కలర్స్ వేశారు. ఇప్పటికే తలనీలాలు, టెంకాయల వేలాలు పూర్తి చేశారు. రవాణాకు బస్సు సౌకర్యం కల్పిస్తుండగా, తాగునీటి వసతి కల్పించడంతో పాటు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

వెలిసిన దుకాణాలు

జాతర వద్ద వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. వీటిలో ఆట వస్తువులు, కిరాణ, స్వీట్ షాపులు న్నాయి. పిల్లలు ఆడుకునేందుకు జాయింట్ వీల్స్, బ్రేక్ డ్యాన్స్ తదితర వస్తువులు సైతం ఏర్పాటు చేశారు. ముందుగానే వచ్చిన భక్తులు సందడి చేస్తున్నారు.



మకరతోరణంతో అలంకరించబడిన చౌడమ్మతల్లి, యలమంచమ్మ, గంగమ్మ తల్లి విగ్రహాలు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

జాతరలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతరను 8 జోన్లుగా విభజించారు. 7 ప్రాంతాల్లో శాశ్వత మరుగుదొడ్లు, 30 ప్రదేశాల్లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా 60 తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు మూడు షిఫ్టుల ప్రకారం షిఫ్టుకు 188 మంది చొప్పున మొత్తం 564 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో పాల్గొననున్నారు. అదే విధంగా షిఫ్టుకు 6 ట్రాక్టర్ల ద్వారా చెత్తా చెదారం తొలగించనున్నారు. వివిధ పనుల నిమిత్తం 48 మంది పంచాయతీ కార్యదర్శులను నియమించారు. పర్యవేక్షణకు 24 మంది జోనల్ అధికారులుగా జిల్లా పంచాయతీ రాజ్ శాఖ జిల్లాస్థాయి అధికారులను, అలాగే 16 మంది మున్సిపల్ జవాన్లు, ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 45 మంది సూపర్ వైజర్లను నియమించారు. రాత్రి పూట వెలుగులు విరజిమ్మేలా ఎల్ఈడీ లైటింగ్స్ ఏర్పాటు చేశారు. నాలుగు జనరేటర్లు కూడా అందుబాటులో ఉంచారు. ఆలయం వద్ద ఉన్న కోనేరును శుభ్రం చేయించారు.

ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ వెంకట్రావు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దురాజ్‌పల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న పెద్దగట్టు జాతర నిర్వహణపై ఆయన సాక్షితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. పెద్దగట్టు జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అంచనా వేశాం. అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాం. గట్టు పరిసర ప్రాంతాల్లో ట్యాంకులు ఏర్పాటు చేసి మిషన్ భగీరథ నీటిని అందించనున్నాం. పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. హెల్త్ క్యాంపులు, హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశాం. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ సిబ్బందితో 24 గంటల బందోబస్తు ఏర్పాటు చేశాం. జాతరకు ప్రముఖులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రొటోకాల్ అధికారులను నియమించాం. ప్రముఖులు దర్శనానికి వచ్చినప్పుడు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు నిరంతరం పర్యవేక్షిస్తాం.

జాతరను విజయవంతంగా నిర్వహిస్తాం



భేరీలు మోగిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, వట్టె జానయ్య యాదవ్

సూర్యాపేట : పెద్దగట్టు శ్రీలింగమంతుల స్వామి జాతరకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. జాతరలో భాగంగా తొలి ఘట్టమైన మకర తోరణం తరలింపు ప్రక్రియను శనివారం సూర్యాపేటలోని గొల్లబజార్ ఎల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసి మంత్రి ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి భేరీలు మోగించారు. ఓ లింగా అంటూ సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని క్రమపద్ధతిలో నడపడంలో ఆయా ప్రాంతాలు, వర్గాల సంస్కృతీ సంప్రదాయాల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలను ఐక్యం చేయడంలో పెద్దగట్టు వంటి జాతరలు దోహద పడుతాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ హయాంలో అన్ని కులాలు, మతాలకు సమన్యాయం కల్పించామన్నారు. ఆదివారం రాత్రి కేసారం నుంచి దేవర పెట్టె తరలింపు అనంతరం సోమవారం నుంచి భక్తులు వస్తారని రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా 15 లక్షల మంది భక్తులు వస్తారన్నారు. ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద గట్టు చైర్మన్ కోడి సైదులుతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్‌కు రెడ్ సిగ్నల్

బడ్జెట్‌లో నిధులు విదిల్చని కేంద్రం

- సికింద్రాబాద్ – ఖాజీపేట మూడో లైన్‌కూ మొండి చేయి
- బీబీనగర్ – నడికుడి డబ్లింగ్ పనులకు రూ.60 కోట్లు కేటాయింపు
- భూ సేకరణ, సర్వే పనులకు కూడా చాలవంటున్న నిపుణులు



ఎంఎంటీఎస్ రావాల్సిన యాదాద్రి రైల్వే స్టేషన్

సాక్షి, యాదాద్రి : కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు మొండిచేయి చూపారు. జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఎంఎంటీఎస్‌కు పైసా కూడా విదిల్చలేదు. సికింద్రాబాద్ – ఖాజీపేట మూడో లైన్ ప్రస్తావనే లేదు. బీబీనగర్ – నడికుడి మార్గంలో డబ్లింగ్ పనులకు నిధులు కేటాయించినప్పటికీ భూ సేకరణ, సర్వే చేయడానికి కూడా చాలవంటున్నారు.. నిపుణులు.

ఎంఎంటీఎస్ అటకెక్కినట్లేనా?

సికింద్రాబాద్ – ఖాజీపేట మార్గంలో ఘట్‌కేసర్ వరకు ఉన్న ఎంఎంటీఎస్ రైలును రాయగిరి వరకు పొడిగించారు. కానీ, కేంద్ర బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదు.గత బడ్జెట్‌లో మాత్రం రూ.10 కోట్లు కేటాయించారు. ఎంఎంటీఎస్‌ను ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు పొడిగిస్తూ రేల్వే శాఖ 2016–17లో నిర్ణయం తీసుకుంది. 33 కిలో మీటర్ల ఈ మార్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టాయి. 2020 డిసెంబర్ నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇందుకోసం రూ.330 కోట్ల వ్యయం అవతుందని తొలుత అంచనా వేశారు. ఆరేళ్ల తర్వాత అంచనా వ్యయం పెరిగి రూ.1,200 కోట్లకు చేరింది. కేంద్రం నిధులు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అయితే కేంద్రమే మొత్తం పనులు చేయడానికి నిర్ణయించినప్పటికీ బడ్జెట్‌లో మాత్రం మొండిచేయి చూపడం నిరాశపరిచింది. ఎంఎంటీఎస్ చెర్లపల్లి వరకు మొదటి దశ, ఘట్‌కేసర్ వరకు రెండో దశ, రాయగిరి వరకు మూడో దశ పనులు చేపట్టాలని నిర్ణయించారు. మేడ్చల్ రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి రైల్వే స్టేషన్ (రాయిగిరి) వరకు క్షేత్రస్థాయి సర్వేతోనే సరిపెట్టారు. ఎంఎంటీఎస్ రెండో దశలో చర్లపల్లి నుంచి ఘట్‌కేసర్ వరకు పనులు సాగుతున్నాయి. రాయగిరి వరకు ఎంఎంటీఎస్ వస్తే ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదాద్రి ఆలయానికి వచ్చే భక్తుల ప్రయాణానికి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.


మూడో లైన్ కోసం సర్వే పూర్తి

సికింద్రాబాద్ – ఖాజీపేట మార్గంలో ప్రస్తుతం ఉన్న డబుల్ లైన్‌కు అదనంగా మూడో లైన్ కోసం పదేళ్ల క్రితం సర్వే పూర్తి చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి ఖాజీపేట మీదుగా ఉత్తర, తూర్పు, దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాలకు ప్రతి రోజూ వేలాది మంది ప్రయాణికులు రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. గూడ్స్ రైళ్లు కూడా పెద్ద సంఖ్యలో తిరుగుతుండగంతో రైళ్ల ట్రాఫిక్ పెరిగింది. దీంతో ప్రయాణికులు వెళ్లే రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ క్రమంలో మూడో లైన్ ప్రతిపాదనలు సిద్ధం చేసినా నిధులు మాత్రం మంజూరు కావడంలేదు.

డబ్లింగ్ పనులకు అరకొరగా..

బీబీనగర్ – గుంటూరు మార్గంలో పగిడిపల్లి నుంచి నడికుడి వరకు ఉన్న 248 కిలో మీటర్ల సింగ్ లైన్‌ను డబుల్ లైన్‌గా మార్చాల్సి ఉంది. ఇందుకోసం కేంద్ర బడ్జెట్‌లో కేవలం రూ.60 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు రెండో లైన్ భూ సేకరణకు, సర్వే పనులు చేపట్టడానికి కూడా చాలవని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

భువనగిరి ఖిలాకు నిధులు



ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోని భువనగిరి ఖిలాకు కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. పదేళ్ల క్రితం ఖిలా అభివృద్ధికి కోసం రూ.5 కోట్లు కేటాయించినా వాటిని ఖర్చు చేయలేదు. ఇప్పటికే రోప్‌వే కోసం ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. పర్యాటకుల కోసం వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాకుండా కోట చుట్టూ రైలు ప్రతిపాదనలు అచరణకు నోచుకోవాల్సి ఉంది.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- సాండ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి, యాదాద్రి : వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనుమతి తీసుకొని నిబంధనలు అతిక్రమిస్తునవారితో పాటు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. ప్రధానంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను అడ్డుకోవాలని సూచించారు. మూసీ, ఆలేరు, బిక్కేరు, ఇతర వాగుల నుంచి ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే ఇసుక రవాణా జరిగేలా క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాత్రి వేళల్లో ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయని వాగులపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఇసుక రవాణాపై ప్రతి 15 రోజులకు ఒకసారి విజిలెన్స్ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరమణ,డీటీఓ సురేందర్‌రెడ్డి, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతికుమార్, డీపీఓ సునంద, ఇరిగేషన్ అధికారి నర్సింహులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

గుండాల : విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గుండాల మండల కేంద్రంలోని కేజీబీవీలో స్నేహిత వాయిస్ ఫర్ ఫోర్ గర్ల్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు మానసిక, శారీరక మార్పులపై పది రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. కాలంలో మార్పుల మాదిరిగానే శరీరంలో మార్పులు వస్తాయని, వాటిపై అవగాహన కల్పించేందుకు సెల్ఫ్ డిఫెన్స్‌తో పాటు స్నేహిత కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 271 పాఠశాలల్లోని 45 వేల మంది విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బాలికలు చేసిన నృత్యాలు, పిరమిడ్లు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఎస్ఓ విజయలక్ష్మి, జీసీసీఓ నిర్మలజ్యోతి, పాచిల్ల సర్పంచ్ పందుల రేఖ, సీఆర్పీ లింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ

- ఉపాధ్యాయుల హార్డు కాపీలను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు
- తప్పులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు



హార్డు కాపీలను పరిశీలించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్న అధికారులు

భువనగిరి : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల హార్డ్ కాపీలను విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందుకోసం 10 బృందాలను ఏర్పాటు చేశారు. వచ్చిన దరఖాస్తుల్లో 2015, 2018లో ప్రత్యేక కేటగిరీలో స్పౌజ్‌లో అవకాశం పొందిన వారి వివరాలు పరిశీలిస్తున్నారు. వీటితో పాటు దరఖాస్తుదారుల హార్డు కాపీల్లో తప్పులను గుర్తించి వెబ్‌సెట్‌లో నమోదు చేస్తున్నాయి.

ఖాళీలు, బదిలీ అవకాశం..

జిల్లాలో 627 ఖాళీలు ఉండగా 766 మందికి బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే గెజిటెడ్ హెచ్ఎంల పదోన్నతికి సంబంధించి సీనియార్టీ జాబితాను జిల్లా అధికారులు ఆర్జేడీకి పంపించారు. జిల్లాలో 90 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీలు ఉండగా 2002–డీఎస్సీ కటాఫ్ ప్రకారం 260 మంది ఉపాధ్యాయులను పదోన్నతికి అర్హులుగా గుర్తించారు. దీంతో పాటు 1,747 మంది సీనియార్టీ జాబితాను రూపొందించి జిల్లా వెబ్‌సైట్‌లో పొంపర్చారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్న గణితం సబ్జెక్టులో 299, భౌతిక శాస్త్రం 77, బయోసైన్స్ 284, సాంఘిక శాస్త్రం 329, ఇంగ్లిష్ 204, ఎల్ఎఫ్ఎల్‌గా 477 మంది ఉన్నట్లు గుర్తించారు.

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ప్రధాన జడ్జి బాలభాస్కర్‌రావు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు

భువనగిరి : కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు సూచించారు. అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ సంయుక్తంగా కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచం కాలుష్య కారకాలతో నిండిపోతుందని, దీనికి మానవసమాజం బాధ్యతారాహిత్యం ఎంతో ఉందని, తద్వారా కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు.అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా నడుచుకోవాలని కోరారు. పరిశుభ్రతకు, పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఈ నెల 11వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదా లత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు కోరారు. జిల్లాలో భువనగిరి, ఆలేరు, రామన్నపేట, చౌటుప్పల్ కోర్టుల పరిధిలో లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాజీపడదగిన కేసుల పరిష్కారానికి న్యాయ శాఖ, న్యాయవాదులు, పోలీ స్ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. కక్షిదారులు ఆమోదయోగ్యమైన కేసులను రాజీ చేసుకుని స్నేహపూర్వకంగా జీవించాలని సూచించారు. క్షణికావేశానికి లోనై తగాదాలకు పోవద్దన్నారు. దీంతో కుటుంబపరంగా, ఆర్థికంగా నష్టపోతారని పేర్కొన్నారు. అంతేకాకుండా కేసుల పాలై కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం వృథా అవుతుందన్నారు. జీవితంలో ఎన్నో ఇబ్బందులపాలవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతిదేవి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి, కార్యదర్శి రాంరెడ్డి, న్యాయవాదులు, సీనియర్ సిటిజన్స్, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోదాం.. పెద్దగట్టుకు

- దురాజ్‌పల్లి జాతరకు అంతా సిద్ధం
- నేటి నుంచి ఐదు రోజులపాటు వేడుక
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు
- సేవలందించనున్న వివిధ శాఖల అధికారులు


సూర్యాపేట క్రైం : దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు వేళయింది. నేటి నుంచి ఐదు రోజులపాటు వేడుకలు అంగరంగ వైభవంగా సాగనున్నాయి. జాతరకు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులను తరలించేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులతో పలు కమిటీలను ఏర్పాటు చేసి జాతరను విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రచించారు.

దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 2000 మంది పోలీసుతో మూడు విడతల్లో బందోబస్తు ఉంటుంది. పార్కింగ్ ప్రదేశాలు, వాహనాల మళ్లింపు చర్యలు, బారికేడ్స్, పోలీసు కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్స్, క్యూ లైన్స్, సీసీటీవీ కెమెరాలను బిగించారు. ట్రాఫిక్ రెగ్యులేషన్ చేయడానికి చర్యలు తీసుకున్నారు. భక్తుల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు, పోలీసు కంట్రోల్ రూమ్, హెల్ప్ సెంటర్స్ ఏర్పాటు చేశారు. హెల్ప్ లైన్ సెంటర్స్ ద్వారా అత్యవసర సమయాల్లో పోలీసు వారి సేవలను వినియోగించుకోవచ్చు.

మూడు షిఫ్టులు.. 24గంటల పాటు..

2000 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారు. మూడు షిఫ్టులు, 24 గంటలు బందోబస్తు, బ్లూ కోట్స్, షీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్, మఫ్టీ టీమ్స్, స్పెషల్ పార్టీలు, రోప్ పార్టీలు, పెట్రోకార్ సిబ్బంది, డాగ్ స్కార్డ్, బీడీ టీమ్స్, క్లూస్ టీమ్ విధుల్లో ఉంటారు. చెరువులోకి వెళ్లకుండా సైనేజ్ బోర్డ్స్, బారికేడ్స్ ఏర్పాటు చేశారు. చెరువు వద్ద, కోనేరు వద్ద గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్



ట్రాఫిక్ సమస్య తొలగినట్లే...!

సూర్యాపేట, చివ్వెంల, సూర్యాపేట క్రైం : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పేరు పొందిన దురాజ్‌పల్లిలోని శ్రీ లింగమంతుల స్వామి జాతర ఈ సారి ట్రాఫిక్ సమస్య తొలగిపోయింది. 2007 వరకు మూడు రోజులు మాత్రమే జరిగిన ఈ జాతర, భక్తుల సంఖ్య దృష్టిలో పెట్టుకుని ఆ తర్వాత సంవత్సరం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. జాతర సమయంలో ట్రాఫిక్ నియంత్రిందుకు జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపులు చేపడతారు. ఈసారి జాతరలో ఇటీవల నిర్మాణమై వినియోగంలోకి వచ్చిన జాతీయ రహదారి 365బీబీని ఉపయోగించుకుంటున్నారు. దీని ద్వారా హైదరాబాద్, విజయవాడ మధ్య వాహనాలు స్వేచ్ఛగా వెళ్లే వీలుంటుంది.

వీఐపీ దర్శనం సింహద్వారం గుండా..

భక్తులకు దర్శనం కూడా సజావుగా అయ్యేలా పోలీస్‌శాఖ కసరత్తు చేస్తోంది. జాతరకు వచ్చే వీఐపీలను సింహద్వారం నుంచి గుట్ట పైకి పంపించి దర్శనం చేయించనున్నారు. అటువైపు భక్తులు తక్కువగా ఉంటారని.. వీఐపీల వాహనాలు కోనేరు వరకు వచ్చినా ట్రాఫిక్ సమస్య ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు.


జాతరలో ఏర్పాటు చేసిన హుండీలు

జాతరకు వచ్చే వాహనాల పార్కింగ్ ఇక్కడే..

జాతరకు వచ్చే భక్తుల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

- **మొదటి పార్కింగ్ ప్రదేశం :** సూర్యాపేట మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను ఎన్‌హెచ్ 65 మీద గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రామకోటితండాకు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనాలకు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- **రెండవ పార్కింగ్ ప్రదేశం :** గరిడేపల్లి, పెన్‌పహాడ్ నుంచి జాతరకు వచ్చే భక్తుల వాహనాలను కలెక్టరేట్ వెనుక గల స్థలంలో భారీ పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- **మూడవ పార్కింగ్ ప్రదేశం :** కోదాడ, మునగాల వైపు నుంచి జాతరకు వచ్చే భక్తుల వాహనాలను ఖాసింపేట గ్రామం వెళ్లే మార్గంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- **నాలుగో పార్కింగ్ ప్రదేశం :** మోతె, చివ్వెంల మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను చివ్వెంల మీదుగా మళ్లించి మున్యానాయక్ తండా వద్ద (గట్టుకు వెనకాల) పార్కింగ్ స్థలం కేటాయించారు.
- **వీఐపీ పార్కింగ్ :** జాతరకు వచ్చే వీఐపీల వాహనాల కోసం పెద్దగట్టు తూర్పు మెట్లకు ఎదురు భాగంలో గల స్థలంలో పార్కింగ్ కేటాయించారు.

బందోబస్తు విధులు పకడ్బందీగా నిర్వహించాలి


విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది


మర్రి చెట్టు వద్ద పోలీస్ కంట్రోల్ రూమ్

చివ్వెంల (సూర్యాపేట) : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి పెద్దగట్టు జాతరలో పోలీసులు పకడ్బందీగా బందోబస్తు విధులు నిర్వహించాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. బందోబస్తు విధుల నిర్వహణపై శనివారం జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ సిబ్బందికి ఎస్పీ తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతరకు అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని వీరందరికీ దర్శించుకునే అవకాశం కల్పించాలని, ఏ ఒక్కరూ అసౌకర్యానికి గురికాకుండా విధులు నిర్వర్తించాలన్నారు. భక్తులు గుంపులుగా గుమికూడకుండా దర్శనం వరకు దారి చూపడం ముఖ్య విధి అని అన్నారు. భక్తులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జాతర విధులను ఇబ్బందిగా ఫీల్ కాకూడదని ఆనందంగా నిర్వర్తించాలన్నారు. సమస్యలు వస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. షిఫ్టులవారీగా విధులకు హాజరు కావాలని ఏ ఒక్కరూ బాధ్యతారహితంగా వ్యవహరించకూడదని, చక్కని యూనిఫామ్ ధరించి ఆదర్శంగా ఉండాలన్నారు. రిలీవర్ వచ్చే వరకు విధులు వదిలి వెళ్లవద్దన్నారు. పెద్దగట్టు ప్రాంగణం జాతీయ రహదారి 65పై ఉన్నందున వాహనాల మళ్లింపు, వాహనాల నియంత్రణ చాలా ముఖ్యమైన విధి అని పేర్కొన్నారు. వాహనాల మళ్లింపు ప్రదేశాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనదారులకు మార్గం చూపాలన్నారు. మళ్లింపు మార్గాల్లో సిబ్బంది నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలని, వాహనాలు జామ్ కాకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలని, పునరుద్ధరించాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు, వాహనదారులు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. జాతర బందోబస్తులో సూర్యాపేట జిల్లాతో పాటు నల్లగొండ, వికారాబాద్, నాగర్ కర్నూల్, సంగారెడ్డి, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. 8 మంది డీఎస్పీలు, 25మంది సీఐలు, 110 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, 250హెడ్ కానిస్టేబుళ్లు, 450 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 90మంది మహిళా కానిస్టేబుళ్లు, 300 మంది హోంగార్డులు, 10 స్పెషల్ పార్టీలు, రోప్ పార్టీలు, బీడీ టీమ్స్, డాగ్ స్క్వాడ్, టీఎస్ఎస్‌పీ, స్పెషల్ బ్రాంచ్ టీమ్స్, వలంటీర్స్, షీటమ్స్, టెక్నికల్ టీమ్స్, సెక్యూరిటీ సర్వేలైన్ టీమ్, కమ్యూనికేషన్ సిబ్బంది జాతరలో విధులు నిర్వహిస్తారన్నారు.


విద్యుత్ కాంతుల మధ్య చెరువు

లింగమంతుల సేవలో ఆర్టీసీ

భానుపురి (సూర్యాపేట) : పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు ఆర్టీసీ సర్వం సిద్ధం చేసింది. ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతరకు ప్రయాణికులను చేరవేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు రానుండడంతో ప్రత్యేక సర్వీసులను జాతరకు ఆర్టీసీ నడుపుతోంది. ప్రధానంగా సూర్యాపేట కేంద్రంగా జాతరకు బస్సులు నడపనున్నారు. అలాగే కోదాడ మిర్యాలగూడ డిపోల నుంచి ప్రయాణికులను జాతర వద్దకు తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సూర్యాపేట డిపో నుంచి 60 బస్సులు, కోదాడ నుంచి 20 బస్సులు, మిర్యాలగూడ డిపో నుంచి 8 బస్సులు జాతరకు ప్రయాణికులను చేరవేయనున్నాయి. జాతర వద్ద మూడు వైపులా బస్సుల కోసం స్థలాలను కేటాయించారు.

సూర్యాపేటలో ప్రత్యేక పాయింట్లు..

సూర్యాపేట నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు హాజరు కానున్నారు. దీంతో స్థానిక డిపో నుంచి 60 బస్సులను నడుపుతున్న అధికారులు పట్టణంలో ఐదు ప్రత్యేక పాయింట్లు గుర్తించారు. కొత్త బస్టాండు, కుడకుడ రోడ్డు, ఖమ్మం క్రాస్ రోడ్డు, పొట్టి శ్రీరాములు సెంటర్, పాత బస్టాండ్ వద్ద నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని జాతరకు వెళ్లి తిరిగి ఆయా పాయింట్ల వద్ద దింపనున్నారు. ఈ పాయింట్ల వద్ద ప్రయాణికులను బస్సులో ఎక్కించేందుకుగాను సూర్యాపేటకు డిపోకు చెందిన 25 మంది సిబ్బందితో ప్రత్యేక వలంటీర్లను నియమించారు. అయితే జాతరకు నడిపే ప్రత్యేక బస్సులకు అదనపు చార్జీలు వసూలు చేయొద్దని నిర్ణయించారు.


పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది


దుకాణాల వద్ద భక్తుల సందడి

కమిటీల నియామకం

సూర్యాపేట : జాతర విజయవంతానికిగాను అధికారులతో పలు విభాగాలకు కమిటీలు వేశారు. ఆయా కమిటీలకు చైర్మన్లను నియమించారు.

- **కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ :** కలెక్టర్, ఎస్పీ, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్, డీఎస్పీ సూర్యాపేట, మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట.
- **ఫర్నిచర్ ఏర్పాటు కమిటీ :** పాటిల్ హేమంత్ కేశవ్, చైర్మన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, డీఎస్పీ, సూర్యాపేట, ఆర్ అండ్‌బీ ఈ ఈ, పీఆర్ ఈఈ, పీహెచ్ ఈఈ, మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట, ఆర్డీఓ సూర్యాపేట, అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయశాఖ, ఈఓ దేవాదాయ శాఖ.
- **పారిశుద్ధ్యం నిర్వహణ కమిటీ :** పాటిల్ హేమంత్ కేశవ్, చైర్మన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట, డీపీఓ, ఈఈ భగీరథ, ఈఈ మిషన్ భగీరథ ఇన్‌ట్రా, గ్రిడ్, ఆర్డీఓ.
- **జాతర సెలబ్రేషన్ కమిటీ :** కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి, పాటిల్ హేమంత్ కేశవ్, చైర్మన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, డీఎస్పీ, సూర్యాపేట, డీఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట, డీఈఓ.
- **ఫుడ్ కమిటీ :** డీఎస్ఓ, జిల్లా మేనేజర్ సీఎస్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఈఓ టెంపుల్.


లింగమంతుల స్వామి ఆలయం

జాతరకు 25 ఎకరాల స్థల సేకరణ

చివ్వెంల (సూర్యాపేట) : దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరలో భక్తులు రద్దీ దృష్ట్యా అధికారులు రైతుల వద్ద నుంచి వ్యవసాయ భూమి సేకరించారు. గట్టుకు నలువైపుల 25 ఎకరాల స్థలాన్ని సేకరించి జాతర నిర్వహణకు ఖాళీ స్థలంగా ఉంచారు. సుమారు 33 మంది రైతుల వద్ద నుంచి భూములను సేకరించారు. ఒక్కో ఎకరానికి రూ.25 వేల చొప్పున రైతులకు చెల్లించారు. కాగా గుట్టకు పడమర వైపు చెరువు కట్ట పక్కన ఉన్న సుమారు 3 ఎకరాల స్థలంలో ఊటనీరు నిలవడంతో భక్తులకు అసౌకర్యంగా ఉంది. దీంతో అధికారులు ఆ స్థలానికి చెల్లించిన పరిహారం నష్టపోవాల్సి వచ్చింది.


రైతుల వద్ద నుంచి సేకరించిన వ్యవసాయ భూమి

ప్రొటోకాల్ అధికారుల నియామకం

సూర్యాపేట రూరల్/దురాజ్‌పల్లి/చివ్వెంల : ఆదివారం నుంచి ప్రారంభం కానున్న పెద్ద గట్టు లింగమంతుల స్వామి జాతరకు వచ్చే వీవీఐపీ, వీఐపీలకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా చూసేందుకు తహసీల్దార్ క్యాడర్ ఉన్న అధికారులను ప్రొటోకాల్ అధికారులను నియమిస్తూ.. కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నేటినుంచి ఈనెల 9వరకు జరిగే జాతరలో భాగంగా ప్రోటోకాల్ అధికారులు, సహా య సిబ్బందితో రోజు విడతల వారీగా విధులు నిర్వహించేలా కేటాయించారు.

తేదీ..	సమయం	అధికారులు
5న	6నుంచి2 వరకు	జె.కార్తీక్ (తహసీల్దార్)
5న	2 నుంచి 10 వరకు	హరిశ్చంద్రప్రసాద్ (తహసీల్దార్)
5న	రాత్రి 10 నుంచి ఉ..6 వరకు	సాయగౌడ్(తహసీల్దార్)
6న	ఉ.6 నుంచి మ.2 వరకు	రాంప్రసాద్(తహసీల్దార్)
6న	మ.2 నుంచి రాత్రి10	హ మీన్‌సింగ్‌రాంపతి(తహసీల్దార్)
6న	రాత్రి 10 నుంచి ఉ.6 వరకు	రమణారెడ్డి(తహసీల్దార్)
7న	ఉ.6 నుంచి మ.2 వరకు	యాదగిరిరెడ్డి(తహసీల్దార్)
7న	మ.2 నుంచి రా.10 వరకు	యాదగిరి (తహసీల్దార్)
7న	రాత్రి 10 నుంచి ఉ 6 వరకు	దామోదర్‌రావు (తహసీల్దార్)
8న	ఉ.6 నుంచి 2వరకు	శ్రీనివాసశర్మ(తహసీల్దార్)
8న	మ.2 నుంచిరా 10 వరకు	శ్రీదేవి (తహసీల్దార్)
8న	రా10 నుంచి ఉ 6 వరకు	కృష్ణ(తహసీల్దార్)
9న	ఉ.6 నుంచి మ.2 వరకు	నాగేశ్వరరావు(తహసీల్దార్)
9న	మ2నుంచి రా10 వరకు	సరిత(తహసీల్దార్)
9న	రా.10 నుంచి ఉ6 వరకు	వాజిద్‌అలీ(తహసీల్దార్)


మహిళల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ టాయ్‌లెట్స్

నాణ్యమైన ప్రసాదం అందించాలి

సూర్యాపేట : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి జాతర సందర్భంగా భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్ని అందించాలని జిల్లా ఆహార భద్రత, తనిఖీ అధికారి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం ప్రసాదాల తయారీ కేంద్రాన్ని తన బృందంతో పరిశీలించారు. ప్రసాదం తయారు చేసే పరిసరాల్లో ఈగలు వాలకుండా చూసుకోవాలని అన్నారు. తలకి, చేతులకు ప్రత్యేక గ్లౌజులు ధరించాలని, చేతుల పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. వీరి వెంట ఆహార తనిఖీ అధికారి కృష్ణమూర్తి, లతీఫ్ తదితరులు ఉన్నారు.


మర్రి చెట్టు కింద అధికారుల కంట్రోల్ రూమ్

సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


దుస్తుల పంపిణీలో పాల్గొన్న కలెక్టర్

రామన్నపేట : సామాజిక అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ (కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ) విద్యార్థులు రూపొందించిన 30 డ్రెస్సులను శనివారం భువనగిరి పట్టణంలోని తారకరామ నగర్ అంగన్‌వాడీ సెంటర్ చిన్నారులకు అందజేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రమణి, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి క్రిష్ణవేణి, ప్రిన్సిపాల్ చంద్రకళ, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కు కేంద్రం మొండి చేయి

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీబీనగర్ ఎయిమ్స్‌కు మొండి చేయి చూపిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గసభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది జిల్లాలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించే ఎయిమ్స్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణమైన విషయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు మంగ నర్సింహులు, బాలరాజు, మల్లేశం, చంద్రారెడ్డి, అశోక్ ఉన్నారు.


మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

